# సాయినాథ చాలీసా



శ్రీ కరుడౌ సద్గురువు పదములు!
పరమాత్ముని పరిపూర్ణ రూపములు!
సాయినాథుని అభయ సూత్రములు!
నమ్మినవారికి జ్ఞానదీపములు!

1. జయసాయినాథ పరాత్పరరూపా -
   జయ షిరిడీశా చిన్మయరూపా
2. తల్లిదండ్రులు ఎవరో తెలియదు -
   కులమత వివరములసలే తెలియదు
3. దర్శనమిచ్చెను బాలఫకీరుగ -
   భావన కందని భగవంతునిగా
4. మహల్సపతి మది పిలిచిన దైవము -
   షిరిడీ పురమున వెలసిన దైవము
5. గుల్లము జాడ తెలిపినందుకు -
   నీరూ, నిప్పూ చూపిన తీరుకు
6. చాంద్‌పాటిల్ అచ్చెరువొందెను -
   భక్తునిగా శరణాగతివేడెను

7. రవితేజస్సును కలిగిన యోగీ -
రాగద్వేషములు లేని విరాగి

8. చంద్రుని బోలిన చక్కని సాయి -
చల్లని దీవెన లిచ్చును హాయి

9. యోగిరూపధర హే మహిమాన్విత -
పావనచరిత ఋషిజన సేవిత

10. భక్తజనావన హృదయవిహారీ -
భవభయహారీ కఫ్నీదారీ

11. భగవద్గీతకు భాష్యము చెప్పెను -
ఖురాను పదముల అర్థము చెప్పెను

12. నరనరాలను శుద్ధిపరిచెను -
ఖండయోగమున ఘనుడని చాటెను

13. గురుకటాక్షమును పొందిన ఘనుడు -
సద్గురువై దయచూపే ఘనుడు

14. అన్నదాతహే అభయ ప్రదాతా -
ఆశ్రితులకు ఆనంద ప్రదాతా

15. ఆశాపాశములేని పవిత్రుడు -
అగణిత గుణగణ దివ్యచరిత్రుడు

16. భక్త రక్షణా దీక్షావ్రతుడు -
భుక్తీ ముక్తీ యిచ్చే దేవుడు

17. మృతుడై మళ్లీ జీవము పొందెను -
మాధవమహిమను మహిలో చూపెను

18. నీళ్లతో వెలిగే దీపకాంతులు -
నివ్వెరపోయిరి షిర్డీ ప్రజలు

19. పంచ భూతముల అధిదేవతవు -
భూతభేతాళ నిరోధకుడవు

20. భిక్షమడిగెను తన భక్తులను -
కర్మఫలితమును తనకిమ్మనెను

21. కుష్ఠురోగమే కనుమరుగాయెను -
భాగోజీ నీ దాసుడాయెను

22. బాయిజామాతకు మోక్షదాతవు -
తాత్యాకేమో ప్రాణదాతవు

23. శ్యామానమ్మిన హితుడవు నీవే -
రాధామాయికి స్వామివి నీవే

24. చంద్రోర్కరుడే నీ దరిచేరెను -
దాసగణుడు నీ ఘనతను చాటెను

25. గౌలిబువాకు విఠలదేవుడవు -
ఖోజోకరునకు దత్తదేవుడవు

26. బాంద్రావనితకు నీవే గణపతి -
నిమోన్కరునకు నీవే మారుతి

27. రాముడె నీవని డాక్టరు చెప్పెను -
సత్యదేవుడని గణుడు పలికెను

28. మేఘా నమ్మిన శివుడవు నీవే -
ఫాకే నమ్మిన అల్లా నీవే

29. సకల దేవతారూపము నీవే -
సకల చరాచర జగత్తు నీవే

30. యోగశక్తితో వెలిగించిన ధుని -
పాపాలను కాల్చేసే పావని

31. మైనాతాయిని రక్షించినదీ -
ఇహపరాలకు ఔషధమైనది

32. భక్తులకిచ్చెను బాబా ఊది -
ధుని అందించిన దివ్య విభూతి

33. గోధుమపిండితొ కలరా ఆగెను -
అన్నా సాహెబ్ అచ్చెరువొందెను.

34. బాబాలీలలు కథగా వ్రాసెను -
హేమాదిపంతని బిరుదు పొందెను

35. మసీదు మారెను ద్వారకమాయిగ -
మహిలో వెలిగెను పుణ్య తీర్థముగ

36. సమాధి కోవెల బూటీ కట్టెను -
ఆశ్రితులకు అది అభయము నిచ్చును

37. అందమైన సమ్మోహనమూర్తి -
సచ్చిదానంద చిన్మయమూర్తి

38. జైజైజై అను దివ్యకీర్తనలు ॥జై॥
భక్తులు పాడే నాల్గు హారతులు

39. ఈ చాలీసా సాయీశునిదీ -
సుఖసంపదలను అందించేది

40. రాజేంద్రుని మదిలో పలికించెను -
తన లీలగ భక్తులకు అందించెను ॥జయ॥

మానవరూపము దాల్చిన ఈశా
మంగళకరుడగు షిర్డీశా
సదా హృదయ మందిరమున నిలచే
సామరూపధర సాయీశా